కేసీఆర్ ఉన్నంత వరకూ రైతుబంధు

- రైతుబంధుకు భరోసా ఇచ్చిన సీఎం కేసీఆర్
- రైతుల జీవితాలతో కాంగ్రెస్ చెలగాటం
- బీజేపీతో రేవంత్ కుమ్మక్కు రాజకీయం
- 'రైతుబంధు భరోసా పత్రం' విడుదల చేసిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దాసోజు శ్రవణ్

హైదరాబాద్, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): తన కంఠంలో ప్రాణం ఉన్నంత వరకూ రైతుబంధు ఆగదనే విషయాన్ని స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారని, ఈ మేరకు ఆయన 'రైతుబంధు భరోసా పత్రం' తన ద్వారా విడుదల చేయించారని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దాసోజు శ్రవణ్ చెప్పారు. మంగళవారం ఆయన తెలంగాణభవన్‌లో 'రైతుబంధు భరోసా పత్రం' విడుదల చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీతో కుమ్మక్కయిన రేవంత్‌రెడ్డి తెలంగాణ రైతుల నోట్లో మన్ను కొడుతూ రైతుబంధును నిలిపివేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదరైతుల జీవితాలతో కాంగ్రెస్ ఆటలాడుతున్నదని మండిపడ్డారు. పీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ రైతుల పాలిట శాపంగా మారాయని విమర్శించారు. వ్యవసాయం దండగా అనే పరిస్థితి నుంచి వ్యవసాయం పండుగ అనే స్థాయికి సీఎం కేసీఆర్ తీసుకొచ్చారని, అందుకు రైతులకు ఇచ్చిన ప్రభుత్వ ప్రోత్సాహకాలు ఊతమిచ్చాయని వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచే పేద రైతులకు కేసీఆర్ అండగా ఉన్నారని చెప్పారు.

రైతుల్లో ధైర్యం, భరోసా నింపేందుకే..

కేసీఆర్ బొందిలో ప్రాణం ఉన్నంత వరకు రైతుబంధు ఆగదని, రైతులకు ఉచిత కరెంటు ఇస్తారని, కల్తీలు లేని వ్యవసాయాన్ని మన రైతులు త్వరలోనే చూడబోతున్నారనేది సీఎం కేసీఆర్ మాటగా దాసోజు శ్రవణ్ చెప్పారు. తెలంగాణ రైతులంతా ఈ విషయంపై ఆలోచించి కాంగ్రెస్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు. రైతుల అభ్యుదయవాది కేసీఆర్ అని చెప్పారు. పేద రైతుల జీవితాలు బాగుపడుతుంటే.. రేటెంతరెడ్డి ఎన్నికల కమిషన్‌పై ఒత్తిడి తెప్పించి రైతుబంధును ఆపి, పేద రైతుల నోటికాడ ముద్దను లాక్కున్నారని విమర్శించారు. రైతుబంధుకు పూర్తిగా ఎసరు పెట్టాలని కాంగ్రెస్ ప్రయత్నం చేస్తున్నదని పేర్కొన్నారు. కేసీఆర్‌ది రైతుది పేగుబంధమని చెప్పారు. ఓట్ల కోణంలో రైతుబంధును ఆపించిన కాంగ్రెస్ ఇకనైనా చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు చెప్పారు. రైతుల్లో నెలకొన్న అభద్రతను తొలగించేందుకు, రైతుల్లో భరోసా కల్పించేందుకు 'రైతుబంధు భరోసా పత్రం'తో సీఎం కేసీఆర్ అన్నదాతలకు హామీ ఇచ్చారని, ఈ పత్రంపై ఆయనే సంతకం పెట్టి రైతుల్లో ధైర్యం నింపారని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసరెడ్డి, పార్టీ జనరల్ సెక్రటరీ సోమా భరత్ పాల్గొన్నారు.

రేపు పోలింగ్.. ఏర్పాట్లు పూర్తి

- స్థానికేతరులు లోకల్‌గా ఉండొద్దు
- ఓటరు స్లిప్పులను గుర్తింపు కార్డుగా పరిగణించం
- కేంద్రాల్లోకి ఫోన్లు అనుమతించం
- పోలింగ్ వాహనాలను ఆపొద్దు
- మీడియాతో సీఈవో వికాస్‌రాజ్

హైదరాబాద్, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) వికాస్‌రాజ్ తెలిపారు. రాష్ట్రంలో మంగళవారం సాయంత్రంతో ఎన్నికల ప్రచారం ముగిసినందు న రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ప్రచారం చేయొద్దని సూచించారు. సోషల్‌మీడియాలో కూడా ఎన్నికల ప్రచారం కుదరదని స్పష్టంచేశారు. నియోజకవర్గంలో ఓటుహక్కు లేని స్థానికేతరులు వెంటనే నియోజకవర్గాలను విడిచి వెళ్లాలని స్పష్టంచేశారు. రాష్ట్రంలో మంగళవారం సాయంత్రం నుంచే 144 సెక్షన్ అమల్లోకి వచ్చిందని, ఐదుగురు కంటే ఎక్కువ మంది ఒకేచోట గుమికూడవద్దని సూచించారు. మంగళవారం ఆయన బీఆర్‌కేఆర్ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఈవీఎంల మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను మంగళవారం రాత్రి కల్లా ఎన్నికల పరిశీలకుల సమక్షంలో పూర్తి చేస్తామని చెప్పారు. ప్రజలను ప్రలోభ పెట్టేవాటిపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని, కంట్రోల్‌రూం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నేడు ఎన్నికల సామగ్రి పంపిణీ

ఎన్నికల సామగ్రి పంపిణీ కోసం ప్రతి నియోజకవర్గానికి ఒక డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌తోపాటు అక్కడే ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు ఫెసిలిటేషన్ సెంటర్‌లో బుధవారం కూడా ఓటుహక్కు వినియోగించుకోవచ్చునని తెలిపారు. బుధవారం డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఎన్నికల సామగ్రిని పంపిణీ చేస్తామని, అక్కడి నుంచి పోలింగ్ కేంద్రాలకు వాహనాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఈ వాహనాలు ఎట్టి పరిస్థితుల్లోనూ ముందుగా సూచించిన మార్గంలో కాకుండా వేరే దారిలో వెళ్లకూడదని స్పష్టం చేశారు. టీ తాగేందుకు, లేదా ఇతర అవసరాలకు కూడా వాహనాలను నిలపవద్దని ఆదేశించారు. మాక్ పోలింగ్‌ను నిర్వహించడానికి గురువారం ఉదయం 5.30 గంటల కల్లా అభ్యర్థుల ఏజెంట్లు రావాలని సూచించారు.

గుర్తులు, పేర్లు ఉన్న ఓటరు స్లిప్పులకు నో

ఓటరు స్లిప్పులను గుర్తింపు కార్డుగా పరిగణలోకి తీసుకోబోమని, ఓటరు కార్డు లేదా ఇతర 12 రకాల కార్డుల్లో ఏదైనా ఒకటి తీసుకొనిరావాలని వికాస్‌రాజ్ సూచించారు. రాజకీయ పార్టీలు ఇచ్చే ఓటరు స్లిప్పుపై అభ్యర్థి పేరు, గుర్తు, పార్టీ పేరు ఏవీ ఉండకూడదని, తెల్లకాగితంపై ముద్రించిన వాటిని మాత్రమే పోలింగ్ కేంద్రంలోకి అనుమతిస్తామని స్పష్టంచేశారు. ఈవీఎంల దగ్గరికి పోలింగ్ ఏజెంట్లు వెళ్లవద్దని, ఓటర్లు పోలింగ్ కేంద్రంలోకి ఫోన్ తీసుకొనిరావద్దని సూచించారు. ఓటింగ్ రహస్యంగా వేయాల్సి ఉంటుందని, ఓటును ఫొటో తీయడానికి కూడా వీలులేదని తెలిపారు. హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నవారిలో 94% మంది ఓటుహక్కు వినియోగించుకున్నారని వెల్లడించారు.

27,094 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్

రాష్ట్రంలో 35,655 పోలింగ్ కేంద్రాలు ఉండ గా ఇందులో 27,094 కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ చేయనున్నట్టు వికాస్‌రాజ్ వెల్లడించారు. ఒకేచోట ఎక్కువ సంఖ్యలో కేంద్రాలు ఉన్న 7,571 చోట్ల బయట కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. 12 వేల కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని పోలింగ్ కేంద్రాలను 3,806 సెక్టార్‌లుగా విభజించామని, పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు పనిచేయకపోయినా, ఇతర సమస్యలున్నా సెక్టార్ అధికారులు పరిష్కరిస్తారని చెప్పారు.

737 కోట్లు సీజ్

ఇప్పటివరకు రూ.737 కోట్ల విలువైన నగదు, వస్తువులు, మద్యాన్ని సీజ్ చేశామని వికాస్‌రాజ్ వెల్లడించారు. ఇందులో రూ.302 కోట్ల నగదు, రూ.125 కోట్ల విలువైన మద్యం, రూ.40 కోట్ల విలువైన డ్రగ్స్, రూ.186 కోట్ల విలువైన మెటల్స్, రూ.84 కోట్లు విలువైన ఉచిత బహుమతులను సీజ్ చేశామని వివరించారు. సమావేశంలో అడిషనల్ సీఈవో లోకేశ్‌కుమార్, జాయింట్ సీఈవో సర్ఫరాజ్ అహ్మద్, డిప్యూటీ సీఈవో సత్యవాణి పాల్గొన్నారు.

రేపు సెలవు

ఎన్నికల పోలింగ్ సందర్భంగా గురువారం ప్రభుత్వం సెలవు ప్రకటించింది. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, అన్ని విద్యాసంస్థలకు సెలవు ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాలున్న విద్యాసంస్థలకు బుధ, గురువారాల్లో సెలవు ఇచ్చారు. ఎన్నికల విధుల్లో ఉన్న విద్యాశాఖ సిబ్బందికి బుధ, గురువారాల్లో సెలవుతోపాటు డిసెంబర్ 1న స్పెషల్ క్యాజువల్ లీవుగా ప్రకటించారు.

కోపా విజేత శ్రీమన్య

ఆట

హైదరాబాద్, ఆట ప్రతినిధి: స్పెయిన్ వేదికగా జరిగిన కోపా స్మార్ట్ టెన్నిస్ టోర్నీలో రాష్ట్ర యువ ప్లేయర్ శ్రీమన్య రెడ్డి టైటిల్ విజేతగా నిలిచింది. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో శ్రీమన్య 6-2, 6-2తో లారా డయాజ్‌గార్సియా (స్పెయిన్)పై అద్భుత విజయం సాధించింది. ఆది నుంచే తనదైన దూకుడు కనబరిచిన శ్రీమన్య వరుస సెట్లలో ప్రత్యర్థిని మట్టికరిపించింది. బలమైన ఫోర్‌హ్యాండ్ షాట్లకు తోడు పదునైన ఏస్‌లతో కీలక పాయింట్లు ఖాతాలో వేసుకుంది.

సిక్కిరెడ్డి జోడి విజయం

లక్నో : సయ్యద్ మోదీ బ్యాడ్మింటన్ టోర్నీలో సిక్కిరెడ్డి-సుమీత్‌కుమార్ రెడ్డి జోడి ముందంజవేసింది. మంగళవారం జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో సిక్కిరెడ్డి ద్వయం 21-14, 21-14తో తైవాన్‌కు చెందిన హువాన్ యి వు-చు యున్‌పై గెలుపొందారు. మరో మ్యాచ్‌లో అశ్విని పొన్నప్ప-రోహన్ కపూర్ జోడికూడా 21-12, 21-18తో మలేసియాకు చెందిన పెంగ్ సున్ చన్-యీ సీ చేహ్‌పై విజయం సాధించింది. పురుషుల సింగిల్స్‌లో చిరాగ్ సేన్ 21-7, 12-21, 21-17తో రవిపై గెలుపొందాడు. అనంతరం ధ్రువ్ రావత్‌తో కలిసి 22-24, 21-13, 21-17తో విమల్‌రాజ్ అన్నాదురై-నవీన్ ప్రశాంత్ జోడిపై గెలుపొంది రెండో రౌండ్‌కు చేరుకున్నారు.

ఉత్తరప్రదేశ్ వేదికగా జరుగుతున్న జాతీయ సీనియర్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో తెలంగాణకు రజత పతకం దక్కింది. మంగళవారం జరిగిన మహిళల కాంపౌండ్ విభాగంలో తెలంగాణ ద్వయం రెండో స్థానంలో నిలిచింది.

లైబ్రరీలా స్టేడియం: కమిన్స్

సిడ్నీ : ప్రపంచకప్ ఫైనల్లో విరాట్ కోహ్లీ ఔటవగానే స్టేడియం లైబ్రరీని తలపించిందని ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ అన్నాడు. స్టేడియంలోని లక్షకుపైగా ప్రేక్షకులు నిశ్శబ్దంగా ఉండిపోయారని, అది తాను ఊహించలేదన్నాడు. ఈ సందర్భం తన మనసులో చిరకాలం నిలిచిపోతుందన్నాడు. కమిన్స్ బౌలింగ్‌లో కోహ్లీ బంతిని వికెట్లమీదకు ఆడుకుని అవుటవగానే స్టేడియంలో నిశ్శబ్దం ఆవరించింది. అప్పటివరకు బౌండరీలు కొట్టినపుడల్లా ఉత్సాహంతో ఊగిపోయిన ప్రేక్షకులు మౌనపాత్ర వహించారు. ప్రపంచకప్‌ను గెలవడం తమ లక్ష్యమని, దానిని సాధించినపుడు కలిగే ఆనందం వేరని కమిన్స్ అన్నాడు. ప్రపంచకప్ గెలవాలంటే 11మంది మాత్రమే మంచి ఆటగాళ్లుంటే సరిపోదని, జట్టులోని 25మంది మెరుగైన ఆటగాళ్లుండాలన్నాడు. అందుకే ఆస్ట్రేలియా జట్టు కప్‌ను సాధించిందన్నాడు.

మ్యాక్స్ మెరుపులు

ధనాధన్ సెంచరీతో విజృంభణ

భారత్‌పై ఆసీస్ అద్భుత విజయం

రుతురాజ్ గైక్వాడ్ శతకం వృథా

భారత్	ఆస్ట్రేలియా
222/3	225/5

మొత్తం 447 పరుగులు

గువాహటి: భారత్‌తో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఆస్ట్రేలియా పోటీలోకి వచ్చింది. వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓడి సిరీస్ చేజార్చుకునే క్లిష్టమైన పరిస్థితుల్లో సమిష్టి ప్రదర్శన కనబరిచింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో ఆసీస్ 5 వికెట్ల తేడాతో టీమ్‌ఇండియాపై విజయం సాధించింది. మరో రెండు మ్యాచ్‌లు మిగిలున్న సిరీస్‌లో భారత్ ప్రస్తుతం 2-1 ఆధిక్యంలో ఉంది. మొదట రుతురాజ్ గైక్వాడ్(57 బంతుల్లో 123నాటౌట్, 13ఫోర్లు, 7 సిక్స్‌లు) అజేయ సెంచరీతో అదరగొట్టడంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 222/3 స్కోరు చేసింది. కెప్టెన్ సూర్యకుమార్‌యాదవ్(39), తిలక్‌వర్మ(31 నాటౌట్) ఆకట్టుకున్నారు. రిచర్డ్‌సన్, బెహెన్‌డార్ఫ్, హార్డీ ఒక్కో వికెట్ తీశారు. లక్ష్యఛేదనకు దిగిన ఆసీస్ 20 ఓవర్లలో 225/5 స్కోరు చేసింది. డాషింగ్ బ్యాటర్ మ్యాక్స్‌వెల్ (48 బంతుల్లో 104 నాటౌట్, 8 ఫోర్లు, 8 సిక్స్‌లు) సునామీలా విరుచుకుపడ్డాడు. ట్రావిస్ హెడ్ (35), కెప్టెన్ వేడ్ (28 నాటౌట్)రాణించారు. జట్టు గెలుపు ఆశలు వదులుకున్న వేళ మ్యాక్స్‌వెల్ మ్యాచ్ గతినే మార్చేశాడు. విధ్వంసక షాట్లతో చెలరేగుతూ పరుగులు కొల్లగొట్టాడు. బిష్ణోయ్(2/32) రెండు వికెట్లు తీశాడు. మ్యాక్స్‌వెల్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

భారత్, ఆస్ట్రేలియా భారీ స్కోరింగ్ మ్యాచ్ అభిమానులను కట్టిపడేసింది. సిరీస్‌లో నిలువాలంటే కచ్చితంగా గెలువాల్సిన మ్యాచ్‌లో కంగారూలు కదంతొక్కారు. టీమ్‌ఇండియా నిర్దేశించిన లక్ష్యాన్ని అలవోకగా ఛేదిస్తూ సిరీస్‌లో తొలి విజయాన్ని ఖాతాలో వేసుకున్నారు. సహచరులు విఫలమైన చోట తానెంత ప్రమాదకారో మరోమారు చేతల్లో చూపిస్తూ మ్యాక్స్‌వెల్ మెరుపులు మెరిపించాడు. గెలుపు ఆశలు సన్నగిల్లిన వేళ తన విధ్వంసక బ్యాటింగ్‌తో ఆసీస్‌కు చిరస్మరణీయ విజయాన్ని కట్టబెట్టాడు. భారత బౌలర్లను ఉతికి ఆరేస్తూ బౌండరీలతో విరుచుకుపడ్డాడు. తొలుత యువ బ్యాటర్ రుతురాజ్ గైక్వాడ్(123) అజేయ సెంచరీతో అదరగొట్టాడు. ఆసీస్ బౌలర్లను టీటుగా ఎదుర్కొంటూ వీరవిహారం చేశాడు. వరుసగా మూడో మ్యాచ్‌లో టీమ్‌ఇండియాకు భారీ స్కోరు కట్టబెట్టడంలో కీలకమయ్యాడు.

మ్యాక్స్ ఊచకోత

ఆసీస్ హార్డ్‌హిట్టర్ మ్యాక్స్‌వెల్ ఊచకోత కోశాడు. అనుభవం లేని భారత బౌలింగ్ దాడిని తుత్తునియలు చేస్తూ ఆసీస్‌కు అద్భుత విజయాన్ని కట్టబెట్టాడు. నిర్దేశిత 223 పరుగుల లక్ష్యఛేదనలో ఆరో ఓవర్లో క్రీజులోకి వచ్చిన మ్యాక్స్‌వెల్ తుఫాన్ ముందు ప్రశాంతతలా సింగిల్స్ తీస్తూ ఆ తర్వాత సునామీలా విరుచుకుపడ్డాడు. ఓవైపు సహచరులు నిష్క్రమిస్తుండటం, ఛేదించాల్సిన లక్ష్యం అంతకంతకూ పెద్దగా ఉన్నా..ఆత్మవిశ్వాసం కోల్పోకుండా మొండిగా ముందుకుసాగాడు. విజయానికి ఆరు బంతుల్లో 21 పరుగులు అవసరమైన దశలో 6, 4, 4 కొట్టి జట్టును ఒంటిచేత్తో గెలిపించాడు. ఈ క్రమంలో ఆసీస్ తరపున ఫించ్, ఇంగ్లిస్(47 బంతుల్లో)తో కలిసి వేగవంతమైన సెంచరీ రికార్డు దక్కించుకున్నాడు.

సంక్షిప్త స్కోర్లు

భారత్: 20 ఓవర్లలో 222/3(రుతురాజ్ 123 నాటౌట్, సూర్యకుమార్ 39, బెహెన్‌డార్ఫ్ 1/12, రిచర్డ్‌సన్ 1/34), **ఆస్ట్రేలియా:** 20 ఓవర్లలో 225/5(మ్యాక్స్‌వెల్ 104 నాటౌట్, హెడ్ 35, బిష్ణోయ్ 2/32, అక్షర్‌పటేల్ 1/37)

ఫిలిప్స్ విజృంభణ

బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్ 310/9

సిల్హెట్(బంగ్లాదేశ్): బంగ్లాదేశ్‌తో మంగళవారం మొదలైన తొలి టెస్టులో న్యూజిలాండ్ స్పిన్నర్ గ్లెన్ ఫిలిప్స్(4/37) నాలుగు వికెట్లతో విజృంభించాడు. తొలుత టాస్ గెలిచిన బంగ్లా..బ్యాటింగ్ ఎంచుకుంది. ఓపెనర్ హసన్‌జాయ్(86) మెరుగైన శుభారంభాన్ని అందించాడు. మరో ఓపెనర్ జకీర్ హసన్(12) నిరాశపరిచినా..హసన్ జట్టును ముందుండి నడిపించాడు. కివీస్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ తన ఇన్నింగ్స్‌లో 11 ఫోర్లతో ఆకట్టుకున్నాడు. అయితే స్పిన్నర్ ఫిలిప్స్ రంగప్రవేశంతో బంగ్లా బ్యాటర్లు క్రీజులో నిలదొక్కుకోలేకపోయారు. పిచ్ పరిస్థితులను సద్వినియోగం చేసుకుంటూ ఫిలిప్స్ చెలరేగడంతో బంగ్లా వరుస వికెట్లు కోల్పోయి తొలి ఇన్నింగ్స్‌లో 9 వికెట్లకు 310 పరుగులు చేసింది. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి తైజుల్, షరీఫుల్ క్రీజులో ఉన్నారు.